క్లుప్తంగా

సాంఘిక నాటక కళాకారుడు రాజుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం బండ రాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు కొత్త రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాలాది వెంకటేశ్వరరావు, కొత్తపల్లి చౌడేశ్వరరావు, శ్రీపాది రాజేష్, పోసం వెంకట్రావు, పాపోలు శ్రీనివాసరావు, ఉరిటి శ్రీనివాసరావు, కనగాల సాంబశివరావు, కనగాల శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవాని, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రీ టౌన్ ఎస్ఐగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం



తెనాలి రూరల్: స్థానిక త్రీ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె. వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కావలి టూ టౌన్ ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డీఎస్పీ స్రవంతిరాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భట్టిప్రోలు హౌసింగ్ ఏఈగా సౌమ్య



భట్టిప్రోలు: హౌసింగ్ ఏఈగా రావూరి సౌమ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె బాపట్ల హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి భట్టిప్రోలుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రామమోహన్‌రావు మంగళగిరి డీఈగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

నేడు అద్దేపల్లిలో భావనారుషి కల్యాణం

భట్టిప్రోలు: స్థానిక పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి తిరువీధుల వారి శ్రీ సీతారామ మందిర ప్రాంగణంలో శనివారం శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామి నగరోత్సవం అనంతరం పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైభవంగా గణపతి హోమం

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరులో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిత్యాపోసన హోమం, బలిహరణ, శ్రీ గణపతి హోమం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మ కర్తలు తాడికొండ శేషగిరిరివు ఆధ్వర్యంలో కుమారులు ప్రసన్న కుమార్ దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వామికి మహా పూర్ణాహుతి, మహా నివేదన, హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి రథాంగ హోమం అనంతరం స్వామి రథోత్సవం జరిపారు. భక్తులు పండ్లు, పూలు, టెంకాయలు, పసుపుకుంకుమలు సమర్పించారు. జై గణేష్....జై జై గణేష్ నామస్మరణతో రథోత్సవం కొనసాగింది. రుత్వికుడు కౌతా రాజేష్ శర్మ హోమం నిర్వహించగా, పూజల్ని ఆలయ ప్రధాన అర్చకుడు క్రోవి శ్రీరామచంద్రమూర్తి శాస్త్రయుక్తంగా జరిపారు.

ఉత్తమ విద్యార్థినులకు నగదు బహుమతుల అందజేత

జంపని(వేమూరు): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతుల్ని ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు హెచ్ఎం బద్రి నారాయణ తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గత ఏడాది పాఠశాలలో చదివిన టెన్త్ విద్యార్థినులు షేక్ అపాష్మీ, ఆలపాటి కావ్య, అలూరు వినీత అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. వేమూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయకుమారి వారికి నగదు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని సాయిబాబా మందిర సమీపంలో నూతనంగా నిర్మించిన 8, 10వార్డుల సచివాలయాల్ని శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చేతుల మీదుగా ప్రారంభించే సచివాలయ ప్రారంభోత్సవంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 38వ వార్డులో ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారాన్ని అప్పగించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 38వ వార్డు రజక చెరువు నుంచి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 38వ వార్డు కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఎక్కడాలేని విధంగా తెనాలి పట్టణంలోని 38వ వార్డులో ఎక్కువ మంది రజకులు నివసిస్తున్నారని చెప్పారు. ఈ వార్డులో గతం నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన వారే కౌన్సిలర్లుగా గెలుపొంది ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు రాజకీయాల్లో సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రాజ్యాధికారాన్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆయా సామాజిక వర్గాల్లోని ఉప కులాలకు కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం స్థానిక సంస్థల్లో స్థానం కల్పించినట్లు చెప్పారు. ఈ వార్డుతో తమ కుటుంబానికి 50 సంవత్సరాల నుంచి మంచి అనుబంధం ఉందని తెలిపారు. తన తండ్రి, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణతో వార్డు ప్రజలకు మంచి సంబంధాలు ఉండేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన తరువాత సంక్షేమం, అభివృద్ధితో పాటు సామాజిక సమతుల్యాన్ని పాటించారని చెప్పారు. వార్డులోని ప్రజలు తెలియజేసిన గ్రీవెన్స్‌ను అతి కొద్ది నెలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, గడవర్తి సాయిహరేరామ్, షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, కొమ్మురబత్తుని జయపాల్, కుర్రా సుజాత, యాతాటి అనిల్, 38వ వార్డు నాయకులు ఎంపీటీసీ ధర్మరాజుల చెన్నయ్య, పెసర్లంక రమణ, షేక్ మీరావలి, బొమ్ము నాగిరెడ్డి, మునిపల్లి వంశీ, కౌవరపు శంకర్, కౌవరపు చిన్న వెంకటరమణ, డాక్టర్ రియాజ్‌ఖాన్, జెట్టి శివరామకృష్ణయ్య, వీర్లపాటి మురళీకృష్ణ, ఆళ్ల సుబ్రహ్మణ్యం, రంగినేని రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, కాళిదాసు వెంకట సత్యం, కఠారి హరీష్, షేక్ గఫూర్, కుక్కల ముక్తేశ్వరరావు, చుండూరు సాయి, పోతిరెడ్డి హేమలత, మల్లిబోయిన రాము, శానంపూడి రఘురామిరెడ్డి, కాకిదేవ సహాయం, కుర్రా శ్రీను, కన్నెగంటి గోపిచంద్, పిన్నబోయిన పెద్ద బసవయ్య, కనపర్తి అనిల్, సిరి కృష్ణ పాల్గొన్నారు.

పలువురు అధికారులకు ప్రశంసా పత్రాలు





గుంటూరులో గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తెనాలి ఎంవీఐ రాఘవరావు, ఎక్సైజ్ కమిషనర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ పెద్దయ్య





కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ వంశీ

తెనాలి అర్బన్/ తెనాలి రూరల్ : గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. గుంటూరు పరేడ్ గ్రౌండ్ గురువారం నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రశంసా పత్రాల్ని అందజేశారు. తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు కలెక్టర్ చేతుల మీదుగా పత్రాల్ని అందుకున్నారు. తెనాలి ప్రాంతంలో వాహన నిబంధనలు పాటించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన చొరవ చూపారు. నిబంధనలు పాటించని వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరించడంతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో గణతంత్ర వేడుకల్లో గౌరవం దక్కింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంగా ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుల్ పెద్దయ్య ఆ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెనాలి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ వంశీ కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి తెనాలి ఐఎంఎల్ డిపో మేనేజర్ కె. శైలజ, రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ నుంచి ఇన్‌స్పెక్టర్లు సీహెచ్. శ్రీనివాసమూర్తి, ఎం. ప్రమీల ప్రశంసా పత్రాల్ని అందుకున్నారు.

అపర సత్యభామ జమునకు ఘన నివాళి



జమున చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు దిలీప్ రాజా తదితరులు



తెనాలిలో స్నేహితురాలు జమునతో కుసుమ కుమారి (ఫైల్)

తెనాలి టౌన్: అపర సత్యభామకు జమున ప్రతిరూపమని, ఆ పాత్రలో ఆమె కలకాలం గుర్తుండిపోతారని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. నటి జమున చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దిలీప్‌రాజా మాట్లాడుతూ ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలసి జమున నటించిన సినిమాలు తెలుగు సినిమా బతికినంత కాలం సజీవంగానే ఉంటాయన్నారు. ప్రవాసాంధ్రులు మండలి ఆనంద్ బాబు మాట్లాడుతూ అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో జమునకు విపరీతమైన పాత తరం ప్రేక్షకుల ఫాలోయింగ్ ఉందని చెప్పారు. సమావేశంలో మా ఏపీ సభ్యులు పినపాటి సురేష్‌బాబు, రమణయ్య, న్యాయవాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య స్నేహితురాల్ని కోల్పోయా..

దుగ్గిరాల(తెనాలి): దుగ్గిరాల హైస్కూలులో జాయిన్ అయినరోజే జమున నేరుగా క్లాసుకు వచ్చి నా పక్కనే కూర్చొంది...అప్పట్నుంచి మొదలైన స్నేహం ఇప్పటివరకు కొనసాగింది...ఇప్పుడు తను లేదంటే నమ్మశక్యం కావటం లేదు..అంటూ ప్రసిద్ధ సినీనటి జమున స్నేహితురాలు జంపాల కుసుమ కుమారి కన్నీటిపర్యంతమయ్యారు. దుగ్గిరాలలో ఉంటున్న కుసుమకుమారికి జమున ఇక లేరన్న వార్త శుక్రవారం ఉదయమే తెలిసింది. తీవ్ర విషాదంలో ఉన్న ఆమె హైదరాబాద్ ప్రయాణమవుతూనే జమునతో తన స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. జమునకు తనకు మూడేళ్లు మాత్రమే వ్యత్యాసం. హంపీ నుంచి దుగ్గిరాలకు వ్యాపారం నిమిత్తం వచ్చారు. బాల్యం నుంచి క్రమశిక్షణగా పెరిగింది తన స్నేహితురాలని చెప్పారు. కళలు, సంగీతంపై ఎక్కువ శ్రద్ధ కనబరచేదనీ, ఏ సినిమా వచ్చినా తనకు తొలిరోజే చూడటం అలవాటని చెప్పారు. మా భూమి నాటకంతో మొదలుపెట్టి, వివిధ నాటకాల్లో నటిస్తూ, సినిమాల్లోకి వెళ్లిందని, అప్పటివరకు దుగ్గిరాలలోనే ఆ కుటుంబం ఉందని తెలిపారు. తొలి నుంచీ జమునకు సినిమాపై ఉన్న ప్రేమ ఆమెను సినిమా రంగంలోకి తీసుకెళ్లిందని తాను భావిస్తున్నట్టు చెప్పారు. సుదీర్ఘ సినీ జీవితంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించారనీ, ఏ పాత్ర వేసినా జీవించేదని చెప్పారు. జమున చనిపోవటం తనకు తీరని లోటన్నారు.

జమునను మరువలేం

తెనాలి: రూపం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల మదిలో నిలిచిన జమునను మరవలేమని, రాజకీయంగానూ ఆమెతో తనకు అనుబంధం ఉందని మాజీ చైర్‌పర్సన్, ఏపీ మహిళా కమిషన్ నన్నపనేని రాజకుమారి తెలిపారు. గొప్ప కళాకారిణిగా కళాకారుల సమస్యల పరిష్కారానికి జమున ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు

తెనాలి అర్బన్: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాసరావు సూచించారు. ఆర్టీసీ తెనాలి డిపో ఆధ్వర్యంలో శుక్రవారం ఆవరణలో చేసిన రోడ్డు భద్రత వారోత్సవాల్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగడంతో పాటు ఎక్కువ స్పీడుతో వాహనాల్ని నడపడం వల్ల అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. డ్రైవర్లు వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ విద్యా పీఠంలో రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



శ్రీ విద్యా పీఠంలో పూజలు నిర్వహిస్తున్న బాలస్వామీజీ, భక్తులు

తెనాలి టౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో రథసప్తమి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, సూర్య నమస్కారాలు, సూర్య యంత్ర ఆరాధన, ప్రదర్శన, అభిషేకాలు, నివేదన, మంగళ హారతి, మంత్రపుష్పంతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల స్వామీజీ రథసప్తమి విశేషాల్ని భక్తులకు వివరించారు. ఆదివారం వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, పసుపులేటి సావిత్రి పాల్గొన్నారు.

వైభవంగా మహా సంప్రోక్షణ ఉత్సవాలు



అర్చకులకు ఆంజనేయస్వామి వెండి విగ్రహాన్ని అందజేస్తున్న దాతలు

తెనాలి టౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో రాజగోపురం మహాసంప్రోక్షణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. నూతన విగ్రహాలకు క్షీరాధివాసం, జలాధివాసం, సేనాదివాసాలను వైఖానస ఆగమోక్తమంగా అర్చకులు, పండితులు చేశారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీల ఆధ్వర్యంలో వైదిక క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. దాత గుడివాడ బాలకృష్ణ దంపతులు ఆంజనేయ స్వామి వెండి విగ్రహాన్ని బహూకరించారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, నిఖిల్ శాండీలియా, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాస్‌రెడ్డి, దాతలు పి.త్రిమూర్తి, గుడివాడ బాలకృష్ణ, జంజం రామారావు, మూర్తి వెంకటేశ్వరరావు, కోటం రమేష్‌నాయుడులు సతీసమేతంగా పాల్గొన్నారు. శ్రీ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



తెనాలి టౌన్: పట్టణ మారీసుపేటలోని పలు ఎరువుల షాపుల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ ఏవోలు వాసంతి, ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా 1.5 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను సీజ్ చేసి, 6-ఎ కింద కేసు నమోదు చేశారు. 2.735 మెట్రిక్ టన్నుల ఎరువులు, 120 లీటర్ల పురుగు మందులు అమ్మకాల నిలుపుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు చేపడతామని తెలిపారు. తనిఖీలో విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ పొలురాజు, కానిస్టేబుల్ బాబు, భాగ్యరాజు పాల్గొన్నారు.

వైభవంగా భావనారుషి కల్యాణం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతి సహిత భావనారుషి స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో జొన్నాదుల కృష్ణ, సత్యనారాయణ, కోటేశ్వరరావు, తాడిపర్తి శివసత్యనారాయణ, వరప్రసాద్, దేవస్థాన చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, సభ్యులు తాడిపర్తి చంద్రశేఖరరావు, గుంటి ధనలక్ష్మి, కౌతరపు వెంకటరమణ, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

బాపట్ల టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రామానగర్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న కొక్కిలిగడ్డ పరంధామయ్యను అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

రేపు టీటీడీ బోర్డు మెంబర్ కిరణ్‌కుమార్‌కు సత్కారం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెనాలి టౌన్: టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన దాసరి కిరణ్‌కుమార్‌ను కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సత్కరించనున్నట్లు మిత్ర మండలి సభ్యులు, అభిమానులు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నందివెలుగు సెంటర్ నుంచి తెనాలి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం వైకుంఠపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజల అనంతరం రామకృష్ణ కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాక్షేత్రంలో ఆరు గంటలకు ఆత్మీయ అభినందన పురస్కార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ మీరావలి, కఠారి హరీష్, కుక్కల ముక్తేశ్వరరావు, ఎస్.ఆర్.కె శర్మ, రెడ్డిరౌతు బాలరాజు, పఠాన్ బుడే, దుర్గాప్రసాద్, ఖలీల్ పాల్గొన్నారు.

హైస్కూలుకు రూ. 2 లక్షల విరాళం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు

పల్లెకోన(భట్టిప్రోలు): తాను చదువుకున్న కారుమూరు-పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూలుకు మండలంలోని పల్లెకోనకు చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావురూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. హైస్కూలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన డిపాజిట్‌ను హెచ్ఎం వి. నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డిపాజిట్‌పై వచ్చే వడ్డీతో ఏటా ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయాలని కోరారు. హెచ్ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇదే విధంగా ప్రతి ఒక్కరూ ఉడతాభక్తిగా సాయాన్ని అందిస్తే ప్రతిభ కలిగిన విద్యార్థుల్ని ప్రోత్సహించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హైస్కూలు ఉపాధ్యాయులు రాఘవరావు, విద్యాసాగర్ అందించిన బహుమతుల్ని అతిథులు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతి బాబు, వేపూరి శివనాగు, బొల్లెద్దు ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి వీవీడీవీ ప్రసాద్, పాల్గొన్నారు.

ఆ ఇంట్లో ఇద్దరు ఐఆర్ఎస్‌లు

నేడు ఐఆర్ఎస్ అధికారి మధుబాబు అభినందన సభ



కవలలు అజయ్‌బాబు, విజయ్‌బాబుతో మధుబాబు దంపతులు

తెనాలి: విజయవాడలో సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ అసిస్టెంట్ కమిషనర్ ఐఆర్ఎస్ అధికారిగా పదోన్నతి పొందిన తెనాలికి చెందిన దోనేపూడి మధుబాబు అభినందన సభ శనివారం ఇక్కడ జరగనుంది. గుర్రం జాషువా విజ్ఞాన సమితి, వన్-లైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటయే సభలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారు. విశేషమేమంటే దిగువ మధ్యతరగతి కుటుంబాన్నుంచి వచ్చిన మధుబాబు ఉన్నతోద్యోగంతో ఐఆర్ఎస్ హోదాను అందుకుంటే, ఆయన తనయుడు 22 ఏళ్ల వయసులో తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్‌ను సాధించటం.. అంటే ఆ ఇంట్లో ఇద్దరు ఐఆర్ఎస్ అధికారులుండటం!

ఏడు పీజీలు

దోనేపూడి మధుబాబు స్వస్థలం రేపల్లె దగ్గర్లోని గ్రామం. రేపల్లెలో హైస్కూలు చదువయ్యాక తెనాలికి వచ్చేసిందా కుటుంబం. ఇక్కడే డిగ్రీ వరకు చదివిన మధుబాబు ఏడు పీజీలు చేశారు. ఎంఏలో ఇంగ్లిష్, హిస్టరీ, సోషియాలజీ, జర్నలిజం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఫిలాసఫీ, సైకాలజీలో పీజీలు చేశారాయన. ఎంఫిల్, ఏపీ గవర్నమెంట్ టీచర్ ట్రైనింగ్‌తో కలిపి మొత్తం తొమ్మిది పీజీలు పూర్తి చేశారు. అంతటి చదువుల దాహం ఆయనది. 1989-93లో దక్షిణ మధ్య రైల్వేలో కమర్షియల్ క్లర్క్/ టికెట్ కలెక్టర్‌గా, 1993-2006లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేరిన తర్వాత కూడా పీజీలు కొడుతూనే వచ్చారు. 2006-2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సూపరింటెండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం విజయవాడ బెంజి సర్కిల్ కార్యాలయంలో చేస్తూ ఇటీవలే అసిస్టెంట్ కమిషనర్‌గా ఐఆర్ఎస్ హోదాను పొందారు.

కుమారుడు విజయ్‌బాబు ఐఆర్ఎస్‌కి ఎంపిక

మధుబాబు భార్య రాజ్యలక్ష్మి కూడా పోస్టుగాడ్యుయేట్. మతాంతర వివాహం చేసుకున్న వీరికి దోనేపూడి విజయ్‌బాబు, అజయ్‌బాబు అనే ఇద్దరు కవలలు. వీరిలో విజయ్‌బాబు 22 ఏళ్ల వయసులోనే సివిల్స్ రాసి తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాడు. ఏ కోచింగ్ సెంటరులో శిక్షణ లేకుండా ఇంట్లోనే ప్రిపేరవుతూ సాధించటం విశేషం. ప్రస్తుతం నాగపూర్‌లో శిక్షణలో ఉన్నారు. సివిల్స్ బీజాన్ని చిన్ననాటే అతడి మనసులో నాటిన తల్లిదండ్రులు, సలహాను మాత్రమే ఇస్తూ, చాయిస్‌ను అతడికే వదిలేశారు. ఈ కృషిలో రెండేళ్లు అతడు సోషల్ మీడియాకు దూరంగా ఉంటే, తల్లిదండ్రులు రెండేళ్లపాటు టీవీక్షణాన్ని త్యాగం చేశారు. తాను జిల్లా కలెక్టరు కావాలని ఆశ పడినా, దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఆర్థిక సమస్యలు, తినటానికే సరిపోని పరిస్థితుల నడుమ అటుకేసి చూసే అవకాశం లేకపోయింది. తాను అందుకోలేకపోయిన సివిల్స్ సాధాన్ని తమ కవల పిల్లలు అందుకుంటే చూడాలని ఆశించిన మధుబాబుకు తన కొడుకు విజయ్‌బాబుకు ఐఆర్ఎస్ రావడం, తనకు అదే హోదా దక్కడం అదృష్టమన్నారు. తన రెండో కొడుకు కూడా సివిల్స్‌కు తయారవుతున్నందున మరో అవకాశం కూడా ఉండాలని ఆశపడుతున్నారు.